గురు పరీక్ష

"తమ సన్నిధిని సాంగ వేదాధ్యయనం చేదామని వచ్చాను."

అన్నాడు ఉపమన్యుడు సవినయంగా చేతులు జోడించి.

ధౌమ్యుని ఆశ్రమంలో, ఆకాశంఅంత మర్రిచెట్టు నీడలో కూర్చుని, యజ్ఞోపవీతాలు వేళ్ళకు చుట్టుకుంటూ, వేదాలు వల్లెవేస్తున్న శిష్యులంతా కళ్ళెత్తి ఒక్క-క్షణం ఆ ఉపమన్యునికేసి చూశారు. ఆ అనవసర ప్రమేయం తమ కెందు కనుకున్నారేమో! మళ్ళీ కళ్ళు వాల్చి తమ వేదాధ్యయనంలో పడ్డారు.

ధౌమ్యమహర్షి రుద్రాక్షమాల మెల్లిగా వేళ్ళ సందులలోనుంచి జారవిడుస్తూ హేలగా ఆ కొత్త వటువును పరకాయించాడు.

మహర్షి కన్నులు చాలా చిన్నవి. కాని చూపులు మాత్రం సూదులు! దట్టంగా, గుబురుగా పెరిగిన కనుబొమ్మలు! తెల్లగా దూదిపింజలా నెరిసిన గడ్డం ఎడంచేతి మునివేళ్ళతో తడుముతూ మహర్షి ఒక్క నిట్టూర్పు విడిచాడు.

ఉపమన్యుడలాగే నిలబడి ఉన్నాడు.

"ఈ సాంగ వేదాధ్యయనం అసిధారావ్రతం!" అన్నాడు ధౌమ్యుడు.

ఉపమన్యుడెంతో ఆత్రంగా ఆచార్యుని నోట వెలువడిన మాటలు విన్నాడు. అలా మరికొన్ని క్షణాలు గడిచిపోయాయి.

"సరే! ప్రతిదినమూ ఆవుల్ని అడివికి తోలుకువెళ్ళి, జాగ్రత్తగా కాస్తూండాలి మరి!" అన్నాడు ధౌమ్యుడు. అంతేగాని వేదాధ్యయనం సంగతే స్మరించలే దా ఆచార్యుడు! అయినా ఉపమన్యు డా మాటకే ఎంతో ఆనందించాడు.

మరునాడు పొద్దున్న ఆశ్రమంలో చెట్లనీడలు మెల్లిగా మేలుకునే సరికే ఉపమన్యుడు ఆవుల్ని అడివిలోకి తోలుకుపోయాడు. మళ్ళీ దీప దీపాలవేళ ఆవుల మందతో ఆశ్రమానికి తిరిగి వచ్చాడు!

"ఉపమన్యూ! మధ్యాహ్నం భోజనానికి మళ్ళీ ఆశ్రమానికి తిరిగి రాలేదా?"

"లేదు!"

"అయినా అలిసినట్లు కనబడడం లేదే!"

"అరణ్యంలో మహర్షుల ఇళ్ళవద్ద మాధుకరం ఎత్తుకున్నాను!"

ధౌమ్యుడు ఉపమన్యుని కేసి ఉరిమినట్లు చూసి—"ఆచార్యునికి నివేదన చెయ్యనిదే ఆ ఆహారం స్వీకరించవచ్చునా? ఎంతటి అపచారం!" అన్నాడు.

మరునాడు శిష్యుడు మాధుకరం ఎత్తి తెచ్చిన అన్నం అంతా గురుదేవునికే అర్పించాడు. దానిలో తా నొక్క మెతుకైనా ముట్టలేదు. అయినా సాయంత్రం అయ్యేసరికి ఆవులమందను వెంటబెట్టుకుని, యథాప్రకారంగా ఆడుతూ పాడుతూ ఆశ్రమానికి చేరుకున్నాడు. ఉపమన్యు డానాడు కూడా ఏమీ నీరసపడినట్లు కనిపించలేదు! ధౌమ్యుడు తిరిగి దానికి హేతువేమని ప్రశ్నించాడు.

"మీకు భిక్షాన్నం నివేదించిన తరవాత ఇంకొకమారు మాధుకరం ఎత్తుకొన్నాను!"

"అది ధర్మ విరుద్ధం! ఇతర బ్రహ్మచారుల భిక్షులకు అడ్డు రావచ్చునా?"

ఉపమన్యుడు తలవంచుకు వెళ్ళిపోయాడు. ఇంక మరి మాధుకరం ఎత్తుకోవడమే మానివేశాడు.

అలా కొంతకాలం గడిచిపోయింది. క్రమంగా ఎండ లెక్కువై మండు వేసవిగా మారిపోయాయి. అడవుల్లో అంటుకున్న దావాగ్నులు రాత్రింబగళ్ళలాగే నిత్యాగ్నిహోత్రాల్లా అఖండంగా వెలిగిపోతున్నాయి! పండుటాకులూ,ఎండుటాకులూ గాలిలో కలిసి గలగల్లాడుతూ ఆకాశంలో సుళ్ళు తిరుగుతున్నాయి. ఆవుల మందలు అడవిలోకి వెళ్ళినా కొంచెం సేపే పచ్చికమేసి వెంటనే చెట్లనీడల్లో పడుకుని మ్రాగన్ను పెట్టి నెమరులు వేసుకుంటున్నాయి. నీరెండిపోయిన సెలయేళ్ళ ఇసుక తిన్నెల్లో మిగిలిన వట్టి ఎండమావులే జలప్రవాహాల్లాగ తళతళ మెరుస్తున్నాయి. పాపం! అడివిలో లేళ్ళన్నీ అవే మంచినీళ్ళనుకొని అక్కడికి పరుగెత్తుకువచ్చి కళ్ళు తిరిగి నురగలు గక్కుకుంటూ పడిపోతున్నాయి!

ఆ వేసవిలో కూడా ఉపమన్యుడలాగే తెల్లతెల్లారే వేళ ఆవుల మందతో అడివికి పోయేవాడు. సూర్యాస్తమయం కణకణలాడే చింత నిప్పులా మెరిసే సమయానికి ఆలమందతో ఆశ్రమానికి చేరుకునేవాడు. అయినా అతని ముఖంలో ఎక్కడా అలిసిన జాడే కనబడేది కాదు!

ఆచార్యుని కిది చాలా వింతగా తోచింది.

ఒకనాడు ఒక చిన్న లేగదూడ నెత్తుకుని మందతో తిరిగి వచ్చిన ఉపమన్యుని ఓరగంట చూచి ఇలా అన్నాడు:

"ఉపమన్యూ! మాధుకరం మానివేసినా మాంచి మదించిన వృషభం లాగే ఉన్నావే! ఏమి టీ అద్భుతం!"

శిష్యుడు కొంచెం తటపటాయించి సమాధానం చెప్పాడు:

"అప్పుడప్పుడు కొంచెం గోక్షీరం పుచ్చుకుంటున్నాను."

ఆ మాట వినబడేసరికి ఆచార్యుని రెండు కళ్ళూ రెండు మిణుగురు పురుగుల్లా మెరిసిపోయాయి. ఉపమన్యునిపై ఒక్కసారి విరుచుకుపడ్డాడు.

"గురుద్రోహీ! గుర్వాజ్ఞ లేనిదే, గురుద్రవ్యం అపహరించిన నీ ముఖం మరి చూడకూడదు. నా ఎదట నిలబడకు! పో!"

ఉపమన్యుని నోట మాట పెగల్లేదు! నాలుక పిడచగట్టుకపోయింది. ఆచార్యుని కాళ్ళమీద పడి తన అపచారం మన్నించవలసిందని పరిపరివిధాల బతిమాలుకున్నాడు.

ఆ ఆచార్యుని కోపం హారతి కర్పూరం. ఇట్టే మండి చల్లారి పోతుంది. ఇలాంటి అపృచ్ఛపు పనులెన్నడూ చేయవద్దని హెచ్చరికచేసి ఆనాటి కథన్ని విడిచివేశాడు.

అలాగ అహర్నిశలు గడిచిపోతున్నాయి. మిగిలిన శిష్యులంతా ఆచార్యుని ఆశ్రమంలోను, మునిపల్లెలోను హాయిగా మాధుకరం ఆరగిస్తూ వేదాలు వల్లెవేస్తున్నారు. ఇతరశిష్యు లెవరూ ఉపమన్యునితో అంత అన్యోన్యంగా సంభాషించడమే లేదు! ఒక్క గురుపత్ని మాత్రమే అప్పు డప్పు డాచార్యుని కంటపడకుండా అతనికి కొన్ని చిన్న కందమూలఫలా లందిస్తూండేది.

ఆ సమయంలో ఉపమన్యునికి దూరంగా ఎక్కడో మునిపల్లెలో ఉన్న తల్లిదండ్రు లొక్కసారిగా జ్ఞాపకం వచ్చేవారు. వెంటనే అతని కళ్ళు చెమ్మగిలేవి.

అత డాశ్రమానికి వచ్చిన తరవాత హేమంత శిశిర వసంత ఋతువులు మూడు గడిచిపోయాయి. ఇక గ్రీష్మంకూడా చాలావరకు గడిచి పోయినట్టే! కాని ఎండ లింకా చండ్రనిప్పులు చెరిగిపోస్తూనే ఉన్నాయి.

ధౌమ్యాచార్యు డెంతో కాఠిన్యం వహించినట్టున్నా ఉపమన్యు డాయన కెంతో భయభక్తులతో పరిచర్యలు చేస్తూండేవాడు. ఒక్కనాడు వేళ తప్పకుండా ఆవుల్ని అడవికి తీసుకుపోతూ, జాగ్రత్తగా వాటికి సంరక్షణ చేసేవాడు. అందులోను లేగలంటే అతనికి ప్రాణం. వాటి

నెంతో వాత్సల్యంతో ఆదరించేవాడు. అవి అతడు పక్కన లేకపోతే పాలుకూడా కుడుచుకునేవి కావు!

ఒకనాడు అరణ్యంలో ఎక్కడ చూచినా దావాగ్ని పొగలే! దానికి తోడుగా కణకణలాడే మండుటెండలో గాలి కొంచెం చూచాయగా వీచి, ఒక్కసారిగా ఆగిపోయింది. సాయంత్రం అయినా గాలి అలికిడి వినిపించ లేదు. చెట్లమీద కాకులు నోళ్ళెండిపోయి కావు కావని అరుస్తున్నాయి. మృగాలు ఆ ఎండవేడిమికీ, వడకూ తట్టుకోలేక తమ తమ శత్రుభావంకూడా మరిచిపోయి పక్క పక్క పొదల్లో దాక్కుని ప్రాణాలు నిలబెట్టుకుంటు న్నాయి. కొంచెం చీకటి పడింది. ఋషివాటికలో గారకాయల నూనె ప్రమిదలలో పోసి వెలిగించిన చిన్న చిన్న దీపాలక్కడక్కడ మినుకు మినుకు మంటున్నాయి. దూరంగా సాయంకాల హోమమంత్రాలు గంభీ రంగా వినిపిస్తున్నాయి.

ముందుగా గోవు లొక్కటొక్కటే ఆశ్రమానికి చేరుకున్నాయి. వాటికి కొంతదూరంలో ఉపమన్యుడున్నాడు. అత డాశ్రమానికి వస్తూనే ధౌమ్యునికి సాష్టాంగ నమస్కారం చేశాడు.

ఈనాడుకూడా అత డంతగా అలిసిపోయినట్లు కనపడలేదు. ధౌమ్యునికి ఆశ్చర్యం వేసింది! వెంటనే అరికాలిమంట నెత్తి కెక్కింది! అయినా కోపం లోపలనే అణుచుకుని, ప్రశాంతంగా 'కారణమేమి'టని అడిగాడు. పక్కనే గురుపత్ని పర్ణశాల ద్వారం వెనక నిలబడి ఉంది. ఆమె ముసిలి పండుముత్తయిదువు! అయినా ధౌమ్యుని కెదుట నిలబడడాని కింకా ఆమెకు భయమే!

ఉపమన్యునికి ఊపిరాడలేదు. ఒకొక్క మాటే తడుముకుంటూ హడిలిపోతూ విన్నవించుకొన్నాడు:

"ఈ వేళ నేనేమీ అపచారం చెయ్యలేదు. అడివిలో లేగలు పాలు

కుడుచుకుంటూంటే, పాల నురగలు రాలితే, అవి మాత్రమే ఆరగించి ప్రాణాలు నిలబెట్టుకున్నాను."

ధౌమ్యుడు ఎత్తిపొడుపుగా ఒక పెద్ద నవ్వు నవ్వి—

"ఎంత ఇంద్రజాలం కల్పించావు!" అన్నాడు.

ఉపమన్యుడు నిర్ఘాంతపోయి, కాలి బొటన వేలితో నేలమీద రాస్తూ తలవంచుకున్నాడు.

"ఆ లేగలన్నిటిని మాయచేసి, మచ్చికచేసి—పాపం! అవి తాగే పాలుకూడా తాగివేస్తున్నావా?" అన్నాడు ధౌమ్యుడు!

ఉపమన్యుడు మాయా చెయ్యలేదు; మచ్చికా చెయ్యలేదు! కాని ఆ లేగలుకూడా అతని కష్టసుఖాలు తెలుసుకున్నాయి. తాము పాలు తాగేటప్పు డతని కింకా ఎక్కువగా పాల నురగ రాలేటట్లు పాలు కుడుచుకు నేవి! ఉపమన్యుడు వాటి నెంతో వాత్సల్యంతో అన్నదమ్ముల్లా ఆదరించేవాడు! అడివిలో లేగ లతని మాట లర్థం చేసుకుని పలకరిస్తూన్నట్లుగా నే అతనితో కలిసి మెలిసి తిరుగుతూ గంతులువేస్తూ ఆడుకు నేవి. ఆచార్య డొక్క చూపులో అదంతా గ్రహించుకొన్నాడు. కాని ఒళ్ళెరగని కోపంతో అతన్ని 'మాయచేశా'వని నిందించాడు!

ఉపమన్యుని కెంత మథనపడ్డా తన తప్పిదం కనపడలేదు! ఆచార్యుని కాఠిన్యం మాత్రమే పెద్ద పర్వతంలా ప్రత్యక్షమయినది. అయినా ఏమనడానికీ పాలుపోక ఎంతో ధైర్యంతో ఆచార్యుని కళ్ళకేసి చూస్తూ—

"ఎంత మథనపడినా నేను చేసిన అపచారమేమీ గోచరించడం లేదు!" అన్నాడు.

ఆచార్యుని కళ్ళు జేవురించాయి!

"అయితే నేనే అనృతవాదినన్నమాట!"

"నేనా మాట ఉచ్చరించనే లేదు." అన్నాడు ఉపమన్యుడు తిరిగి సవినయంగా.

ఆ వినయం మరి భరించలేకపోయాడు ధౌమ్యుడు.

మళ్ళీ కళ్ళల్లో నిప్పులు చెరుగుతూ—

"నీవు నాకే ధర్మబోధ చేస్తున్నావే! చాలు! చాలు! నీ అధ్యయనం! పో! నా ఎదటనించి!" అన్నాడు.

ఉపమన్యుడిక వంచిన తల ఎత్తలేదు!

అతని కళ్ళనుంట బాష్పధారలు జలజలా ప్రవహించాయి.

పక్కనించి ఇది చూస్తున్న గురుపత్నికి గుండె తరుక్కుపోయింది. వెంటనే ఇవతలికి వచ్చి, ఉపమన్యుని చిన్ని జునపాలు చేతితో దువ్వుతూ "అయ్యో! ఇదేమిటీ రాక్షసత్వం! పాపం! పసివాణ్ణెన్ని విధాల హింసిస్తున్నారు!" అన్నది ఆచార్యునితో.

ధౌమ్యుడామెకేసి శపించేటట్లు చూశాడు!

"అయ్యో! నా చిట్టి తండ్రీ! పాలనురగలవల్ల కడుపేం నిండుతుంది నాయనా! రా! కొంచెం నీవరిఅన్నం తిందువుగాని!" అన్నది వాత్సల్యం ఉట్టిపడేటట్టు!

ధౌమ్యుడామె మాటలు విని ఆజ్యధార పోసిన అగ్నిహోత్రంలా మండిపడ్డాడు.

"నీవే దీనికంతటికీ మూలకారణం! నీమూలానే ఇంతటివాడికింతటి ధిక్కారం బలిసిపోయింది. ఇక నే నిది భరించలేను!...పొండి! మీ ఇద్దరూ నా ఎదటనుంచి...ఎంతటి గురుధిక్కారం! ఎంతటి అహంకారం!"

ఇద్దరూ అతని ఎదట తల వంచుకొని అలాగే నిలబడ్డారు. కాని ఎవరూ అక్కడినుంచి కదలలేదు!

వారిని చూస్తూన్న కొద్దీ ధౌమ్యునికి నఖశిఖ పర్యంతము కోపాగ్నిజ్వాలలు ప్రజ్వలించాయి.

"ఏం, ఇద్దరూ ఇక నా ఎదటనుంచి కదలరా!" అని ధౌమ్యు డొక్క ఉరుము ఉరిమాడు.

అంతే. మరుక్షణంలో చేతిలోని జపమాల నేలకు వేసి కొట్టి ఒక్క అంగలో అక్కడినించి వెళ్ళిపోయాడు!

క్రమంగా అప్పటికే ఆకాశం మీద దట్టంగా కారు మబ్బులు పట్టాయి! ఒక్కసారి ఫెళ ఫెళ గర్జనలతో కుండపోతగా వర్షం కురవడం ప్రారంభమైనది!

ఆచార్యుని వెనువెంటనే ఆచార్య భార్య కూడా అక్కడినించి వెళ్ళిపోయింది. ఉపమన్యు డొక్కసారిగా అక్కడనే కుప్పగా కూలబడి పోయాడు.

ఆచార్యుని భార్య ధౌమ్యుని పాదాల మీద పడి ఎంతో దీనంగా బ్రతిమాలుకొన్నది. ఆటుతరవాత ఎట్టకేలకు ధౌమ్యుడు తిరిగీ ఉప మన్యుడు గోవులను అడివికి తీసుకుపోవడాని కంగీకరించాడు. అతని కోపమే అంతటిది!

అలా రెండు మూడహర్నిశలు తిరిగిపోయాయి. ఆనాడు ఆకాశం అంతటా దట్టంగా మబ్బు పట్టింది. సాయంకాలం దాటిపోయింది. అయినా ఉపమన్యుడు పర్ణశాలకు తిరిగి రాలేదు. కొంతసేపటికి గోవులు, గోవత్సాలు 'అంబా' అని అరుస్తూ ఒకటొక్కటే ఆశ్రమానికి మరలి వచ్చాయి. ఒక్క గోవు, గోవత్సము మాత్రం తిరిగి రాలేదు! వాటితోబాటు ఉప మన్యుడూ రాలేదు!

గురుపత్నికి మరి కాళ్ళాడలేదు. మాటి మాటికీ పర్ణశాల ద్వారం దగ్గిరికి వెళ్ళి చూచింది. బాగా చీకటి పడింది! ఇంకా ఉపమన్యుడు రాలేదు! కీచురాళ్ళ మోతలు కూడా ప్రారంభమైనాయి! అయినా కనుచూపు మేరలో ఎక్కడా అతడు కానరాలేదు!

ధౌమ్యుడు ఉలకకుండా పలకకుండా అలాగే అగ్నిహోత్రంలో హోమం చేస్తున్నాడు.

గురుపత్ని ఇక నిలవలేక అడివికి ప్రయాణమయింది. ధౌమ్యుడిక చేసేదిలేక తానూ బయలుదేరాడు. శిష్యులు కూడా వారివెంటపడ్డారు.

అందరూ అడవి అంతటా గాలించారు! ఎక్కడా ఉపమన్యుని జాడ కనబడలేదు! ఆచార్యపత్ని "ఓ ఉపమన్యూ!" అని ఎలుగెత్తి పిలిచింది. ధౌమ్యుడు కూడా మేఘగంభీర స్వరంతో "ఓ ఉపమన్యూ!" అని పిలిచాడు. శిష్యులంతా ఒక్క గొంతుతో "ఓ ఉపమన్యూ!" అని పిలిచారు!

వారి కేకలకు ప్రతిధ్వనించిన కొండ గుహలన్నీ "ఉపమన్యూ!" అని ఎంతో ఆప్యాయంగా పిలిచాయి! చెట్టు కొమ్మల మీద పురి విప్పి నిలబడిన నెమళ్ళన్నీ "ఉపమన్యూ" అని కేకలు వేశాయి! అలాగే అర్థ రాత్రిదాకా కేకలు వేశారు. ఎక్కడా ఉపమన్యుని జాడే పొడగట్టలేదు!

చివరికి అందరూ ఒక్క గొంతుతో "ఉపమన్యూ!" అని గంభీరంగా గర్జించినట్లు పిలిచారు.

అంతలో ఎక్కడో ఒక్క లేగ 'అంబా' అని అరిచింది. వెంటనే ఆ పక్కన ఆవు అంతకన్న గట్టిగా 'అంబా' అని అరిచింది.

అందరూ అటువైపు పరిగెత్తారు. ఒక పాడు దిగుడు బావిదగ్గర ఒక లేగ, ఆవు నిలబడి 'అంబా' 'అంబా!' అని అరుస్తున్నాయి. అందరూ అక్కడికి వెళ్ళారు. ఉపమన్యుడా దిగుడుబావిఒడ్డు పట్టుకుని నీరసంగా మూలుగుతున్నాడు!

వెంటనే శిష్యులతన్ని పైకి తీశారు. ఆచార్యపత్ని అతన్ని గుండెల్లో పొదువుకొని నారచీర చెరగుతో ఒళ్ళంతా తుడిచి కూడా తీసుకువచ్చి చిక్కని గోక్షీరపాత్ర నోటి కందించింది. ఉపమన్యు

డాపాలన్నీ ఒక్క గుక్కలో తాగి కొంత సేదదేరాడు. ఆవు, లేగ అది చూచి తోకలెత్తి ఇంకా గట్టిగా 'అంబా' అని అరిచాయి! అదంతా చూస్తున్న ధౌమ్యుని రెండు కళ్ళమ్మటా కన్నీరు పాలమున్నీరై సంతత ధారగా ప్రవహించింది! ఆచార్యు డతన్ని ఎంతో ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని—

"ఏమి నాయనా! ఇంతటి ఘోర విపత్తులో చిక్కుకొన్నావు?" అన్నాడు.

ఉపమన్యు డలాంటి ఆదర వాక్యాలు వినడానికిదే మొదలు! అందుచేత కొంచెం ధైర్యం తెచ్చుకొని "నే నీ రెండు మూడు రోజుల నించీ జిల్లేడాకులతోనే ప్రాణాలు నిలబెట్టుకొంటున్నాను. ఆ పాలతోనే గొంతుక తడుపుకుంటున్నాను. ఎందువల్లనో నా దృష్టి పోయింది. తిరిగి వస్తూ ఈ దిగుడు బావిలో పడిపోయాను. నా అపరాధం మన్నించాలి!" అన్నాడు.

అందరూ ఒక్కసారిగా ఆ ఉపమన్యుని కళ్ళకేసి చూశారు. ఉపమన్యుడు కళ్ళు తెరిచి అందరినీ తిలకిస్తూనే ఉన్నాడు. అయినా అవి వెర్రి చూపులు! గురుపత్ని అది గ్రహించుకుని మళ్ళీ అతని జునపాలు వేళ్ళతో సవరిస్తూ దగ్గిరికి తీసుకుని ఆచార్యుని వైపు రెప్ప వాల్చకుండా చూచింది. ఆమె కళ్ళు జేవురించాయి! కాని ఆ చూపులు కన్నీటిలో మునిగిపోయాయి! శిష్యులకు అంతవరకూ ధౌమ్యునియెడల కలిగిన భయభక్తు లణుమాత్రమైనా మిగలకుండా అంతరించిపోయాయి! వారందరూ ఆచార్యుని దుశ్చేష్టితాలు తలుచుకొని ఉగ్రులైనారు!

బాష్పాలతో తడిసిన ధౌమ్యాచార్యుని గడ్డం చివళ్ళనించి కన్నీటి బిందువు లింకా ప్రవహిస్తూనే ఉన్నాయి! గురుపత్ని ఒడిలో తల దాచుకున్న ఉపమన్యుని చుబుకం స్పృశించి గద్గదంతో ఒణికిపోతూ ధౌమ్యుడతనితో ఇలా అన్నాడు: "నా చిట్టి తండ్రీ! ఉపమన్యూ! నిన్నెన్నో

విధాలుగా హింసించాను. ఎంతో రాక్షసత్వం వహించాను! కాని, ఈ వేదాధ్యయనం మహా కర్కశమైనటువంటి అసిధారా వ్రతం నాయనా! అలసులకు, శ్రద్ధాహీనులకు వేదజ్యోతి దర్శనం కానేరదు! నీ అభినివేశము, నీ అధ్యయన దీక్ష పరీక్షించడానికే ని న్నిన్ని విధాలుగా బాధించాను! నా శిష్యు లెవరూ ఇంతటి గురు పరీక్షకు తాళుకో లేదు! కనకనే వా రెవరున్ను మంత్ర ద్రష్టలు కాలేకపోయినారు! నీ అభినివేశం దేవతలు కూడా హర్షించదగ్గది. నీకు సాంగ వేదజ్యోతి సందర్శనం కాగలదు! నా శిష్యులలో నీ వొక్కడవే మంత్ర ద్రష్టవు కాగలవు!"

ఉపమన్యుడు అటు ఇటు తడుముకుంటూ ఆయన పాదసన్నిధిని సాష్టాంగ నమస్కారం చేశాడు. శిష్యుల సాధువాదాలు మిన్ను ముట్టాయి.

ఆచార్యుడు ఉపమన్యుని లేవనెత్తి "ఉపమన్యూ! ఒక్కసారి అశ్వినీ దేవతలను స్తుతించుకో! తిరిగి నీకు దివ్యమైన దృష్టిలభిస్తుందిలే!" అన్నాడు. ఉపమన్యుడు, శిష్యులు, ఆచార్య దంపతులూ ఒక్క గొంతుతో వేద మంత్రా లుచ్చరిస్తూ అశ్వినీ దేవతల ననేక విధాలుగా స్తోత్రాలు చేశారు!

వెంటనే ఉపమన్యుని నేత్రాలు జ్యోతుల్లా వికసించాయి! పక్కనే ఉన్న లేగదూడ అతని చేతివ్రేళ్ళు కుడుచుకుంటూ 'అంభా' అని అరిచింది! దట్టంగా కారుమబ్బులు పట్టిన ఆకాశంలో తళుక్కని ఒక్క మెరుపు మెరిసింది!